క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కృషి



తానూరులో పనులు ప్రారంభిస్తున్న నేతలు

తానూరు: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నాయకులు నారాయణ్‌రావ్ పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని తానూరులో రూ.తొమ్మిది లక్షలతో, బోల్సాలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాశెట్టి సాగరబాయి, మండల ఉపాధ్యక్షులు చంద్రకాంత్, పుండలిక్, మాధవ్‌రావ్ పటేల్, గోవింద్‌రావ్ పటేల్, పోతారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న పల్లకిసేవ



పల్లకిసేవలో భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ కాలనీలో మంగళవారం ముజ్జి మల్లన్న పల్లకిసేవను భక్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి పల్లకిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 25న ముజ్జి మల్లన్న జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు శంకర్ యాదవ్, ఆఫ్క గజేందర్ యాదవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి




పిప్రిలో మొక్కలు పరిశీలిస్తున్న నాగమణి

లోకేశ్వరం: నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు ఎండిపోకుండా రోజు నీరందించాలని డీడబ్ల్యూవో, మండల ప్రత్యేకాధికారి నాగమణి అన్నారు. మంగళవారం మండలంలోని పిప్రి, బామ్నికే గ్రామాల్లోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఈసీ అనిల్, కార్యదర్శులు ఉన్నారు.

కొండచిలువ హతం

కుంటాల: మండలకేంద్రం శివారులో కక్కెర ముత్యంరావుకు చెందిన మొక్కజొన్న చేనులో మంగళవారం రాత్రి కొండచిలువను రైతులు హతమార్చారు. ముత్యంరావు చేనుకు పాలేరు లాల్‌సింగ్ నీటిని అందిస్తుండగా కొండచిలువ బయటకు వచ్చింది. భయపడిన పాలేరు సమీపంలోని రైతులను పిలువగా వారు వచ్చి కొండచిలువను హతమార్చి ఖననం చేశారు. కొండచిలువ సుమారు 10 ఫీట్ల పొడవు, 12 కిలోల బరువు ఉందని రైతులు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



శైలజను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సోన్: మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలు అనుముల శైలజను మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఇటీవల నిర్మల్ కేజీబీవీలో ఎల్టా ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి జూలియస్ సీజర్ డ్రామా పోటీల్లో కడ్తాల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ బృందానికి గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయురాలు శైలజకు మెమెంటో, శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన నాయకులు



సీఐకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: పట్టణంలోని ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహ పరిసరాల్లో మత్తు పదార్థాలు, గుట్కా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పట్టణ సీఐ పురుషోత్తంచారిని కోరారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఉన్నారు.

చెరువు కాల్వలు.. కనుమరుగు

చెరువు నుంచి పంటలకు సాగునీరు అందించే కాల్వలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పలు చోట్ల పంట కాల్వలు చెత్తాచెదారం, మట్టితో నిండిపోగా.. మరికొన్ని చోట్ల రైతులు తమ భూముల్లో కలిపేసుకొని దున్నుకుంటున్నారు. దీంతో చెరువులను నమ్ముకొని రైతులు సాగు చేసే పంటలకు నీరు చేరడం లేదు. చెరువుల నుంచి వచ్చే మట్టి కాల్వల స్థానంలో సిమెంట్ కాల్వలు నిర్మించి సమస్య పరిష్కరించాలని వేడుకున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల్లోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – లోకేశ్వరం

- చివరి భూములకు నీరందక ఇబ్బంది పడుతున్న రైతులు
- చెత్తాచెదారం, మట్టితో పూడుకుపోయి ఆనవాళ్లు కోల్పోతున్న కాల్వలు
- పలు గ్రామాల్లో దున్నేస్తున్న వైనం
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు



పూడుకుపోయి ఆనవాళ్లు కోల్పోతున్న లోకేశ్వరం మండలంలోని ధర్మోర చెరువు కాలువ



లోకేశ్వరంలోని భగీరథ చెరువు కింద ఉన్న పంట కాలువ దుస్థితి

నిండుకుండలా చెరువులు..

ఈసారి వర్షాలు పుష్కలంగా కురువడంతో జిల్లాలోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారడంతోపాటు భూగర్భజలాలు వృద్ధి చెందాయి. ఏకధాటిగా వర్షాలు కురువడంతో ఖరీఫ్‌లో నీరు అవసరం రాకుండానే పంటలు చేతికి వచ్చాయి. కానీ ప్రస్తుతం యాసంగి పంటలకు సాగునీరు తప్పనిసరి. ఇప్పటికే చెరువు కింద భూములున్న వారు వివిధ పంటలను సాగు చేసుకుంటున్నారు. ఎస్సారెస్పీ నుంచి నీటి తడులు వస్తున్నందున చెరువుల్లో నీటిశాతం తగ్గడం లేదు. కానీ చెరువు నుంచి పంట కాల్వలకు మాత్రం నీరందడం లేదు. ప్రస్తుతం పక్క చేను రైతులను అడిగి ఎలాగోలా తమ పంటలకు నీరందిస్తున్నారు. కానీ ఎండలు ముదిరితే సమస్య తీవ్రమై రైతులు ఇబ్బంది పడుతారు.

- జిల్లాలో చెరువులు, కుంటలు 659 ఉండగా వీటి ఆయకట్టు పరిధి 65,258 ఎకరాలు.
- ఈ చెరువుల నుంచి 1185 కిలోమీటర్ల మేర పంట కాల్వలున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరో 846 కిలోమీటర్ల కాల్వలు నిర్మించాల్సి ఉందని అధికారుల అంచనా వేశారు. ఈవిషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపినా మంజూరుకు నోచుకోవడం లేదు.
- చెరువుల నుంచి మట్టి కాల్వలు ఉండటంతో ప్రతి సారి మరమ్మతులు చేయించాల్సి వస్తుంది. ఆయకట్టు చివరి భూములకు నీరు అందాలంటే మట్టి కాల్వల స్థానంలో సిమెంట్ కాల్వలు నిర్మించాలి.
- చెరువు కాల్వలను పక్కనున్న చేను రైతులు దున్నకుండా అధికారులు హద్దురాళ్లు ఏర్పాటు చేసి కాపాడాలి.
- ప్రస్తుతం మట్టి కాల్వల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, మట్టిని తొలగించడంతోపాటు అవసరమైన చోట మరమ్మతులు చేయించాలి.

అధికారులు స్పందించాలంటున్న రైతులు..

చెరువు కాల్వలను రైతులు దున్నేయకుండా హద్దురాళ్లు ఏర్పాటు చేసి కాపాడాలని ఆయా గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు. చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల నుంచి పంటలకు నీరు వెళ్లేందుకు 28 కిలోమీటర్ల మేర సిమెంట్ కాల్వలు ఉండాలి.. కానీ కేవలం నాలుగు కిలోమీటర్ల మేర మాత్రమే వీటిని నిర్మించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి పంట కాల్వలకు హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

కొందరు దున్నేస్తున్నారు



గ్రామాల్లో చెరువు నీటిపై ఆధారపడి రైతులు వివిధ రకాల పంటలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. చెరువులో నీళ్లున్నా కాల్వలు పూడుకుపోవడంతో చాలా మంది రైతులు కాల్వలను దున్ని భూమిని ఆక్రమించుకుంటున్నారు. ప్రభుత్వం ఆయకట్టు చివరి భూముల వరకు సిమెంటు కాల్వలు నిర్మించాలి. – శ్రీనివాస్, ధర్మోర

సిమెంట్ కాల్వలు నిర్మించాలి



ఈసారి భారీ వర్షాలతో లోకేశ్వరం భగీరథ చెరువు నిండి అలుగు పారింది. నాకు చెరువు కింద ఎకరం భూమి ఉంది. పంట కాల్వ సరిగా ఉంటే నా భూమికి నీరందుతుంది. కాల్వ సరిగా లేకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. మట్టి కాల్వ స్థానంలో సిమెంటు కాల్వ నిర్మించాలి. – రసూల్, లోకేశ్వరం

ప్రతిపాదనలు పంపిస్తాం

చెరువులు, కుంటల నుంచి ఉన్న పంట కాల్వలను రైతులు దున్నవద్దు. ఎక్కడెక్కడ కాల్వలు నిర్మించాలో చెప్పాలని ఉన్నతాధికారులు వివరాలు అడుగుతున్నారు. త్వరలో ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరవగానే సిమెంట్ కాల్వలు నిర్మిస్తాం. – సుశీల్‌కుమార్, ఎస్ఈ, నీటిపారుదల శాఖ

నియామకం

నిర్మల్‌టౌన్: నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా బక్కూరి రవీందర్‌ను నియమించినట్లు బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మారరాజన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని పదాధికారులు, పార్టీ కార్యకర్తలు రవీందర్‌కు సహకరించాలని కోరారు.

రేషన్ డీలర్లు సకాలంలో సరుకులు అందించాలి

దస్తురాబాద్: రేషన్ డీలర్లు సకాలంలో పేదలకు రేషన్ సరుకులు అందించాలని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో నూతన తహసీల్దార్‌ను మండలంలోని రేషన్‌డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డీలర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీలర్లు చింత సత్తయ్య, ప్రవీణ్, శేఖర్, వెంకటేశ్వరరావ్, శంకర్, గంగన్న తదితరులు ఉన్నారు.

దాతల సేవలు మరువలేనివి



దాతను సన్మానిస్తున్న సభ్యులు

దస్తురాబాద్: మండల కేంద్రంలో శివాజీ విగ్రహ నిర్మాణానికి కృషి చేసిన దాతల సేవలు మరువలేనివని హిందూ ఉత్సవ సమితి సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శివాజీచౌక్‌లో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహానికి రూ.1.50లక్షలు దస్తురాబాద్‌కు చెందిన ఉపాధ్యాయుడు కోట వేణు అందించారు. మంగళవారం వారిని విగ్రహం వద్ద హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. శివ, సాయి, ప్రవీణ్, రాము, ప్రమోద్, మాణిక్, కునాల్, సురేశ్, హరీశ్, శ్రీనివాస్, రాకేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా, ధ్యానం చేస్తే ఒత్తిడి దూరం



అవగాహన కల్పిస్తున్న లక్ష్మణ్

కుంటాల: విద్యార్థులు యోగా, ధ్యానం చేస్తే ఒత్తిడి దూరం అవుతుందని మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు వాడేకర్ లక్ష్మణ్, తోట లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూర్ కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినులకు వార్షిక పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భయం వీడి.. ప్రశాంతంగా వార్షిక పరీక్షలకు సన్నద్ధమవ్వాలన్నారు. సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ'లో వీడ్కోలు వేడుకలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. సమయం వృథా చేయకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంకల్పయాత్రకు తరలిన శ్రేణులు



ఖానాపూర్ నుంచి వెళ్తున్న బీజేపీ నేతలు

ఖానాపూర్: జిల్లాకేంద్రంలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్పయాత్రకు పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఖానాపూర్ నుంచి ప్రత్యేక వాహనాల్లో సభకు బయలుదేరారు. అంకం మహేందర్, నాయిని సంతోశ్, రవీందర్‌రెడ్డి, తోకల బుచ్చన్న, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, గణేశ్, రవి, చందు, కిరణ్, జీవన్, సుధాకర్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. స్తంభం ఇలా.. రాకపోకలు ఎలా?



లోకేశ్వరం: మండలంలోని మొహళ గ్రామంలో హనుమాన్ ఆలయం ఎదుట నడిరోడ్డుపై విద్యుత్ అధికారులు స్తంభం ఏర్పాటు చేశారు. దీంతో ఈరోడ్డు గుండా రాకపోకలు సాగించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై ఉన్న స్తంభం తొలగించి మరోచోట ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : శివకుమార్, విద్యుత్ ఏఈ, లోకేశ్వరం, ఫోన్: 94408 11710

నేడు ఆవిష్కరణ

కుంటాల: కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ తల్లిపై తాను రాసిన పాటను బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ఆవిష్కరిస్తారని మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, నృత్య కళాకారుడు, రచయిత ముజిగే రవి ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా గజ్జలమ్మ ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే పాట ఆవిష్కరిస్తారని.. భక్తులు వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సన్మానం

ఖానాపూర్: అయోధ్య బాలరాముడి దర్శనం కోసం కేంద్ర ప్రభుత్వం ఆస్థా ప్రత్యేక రైలును నడుపుతున్న విషయం తెలిసిందే. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో సిర్పూర్, కాగజ్‌నగర్ నుంచి ప్రత్యేకంగా ఆస్థా రైలు నడిపిస్తున్నట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ రైలుకు ఇన్‌చార్జిగా ఖానాపూర్ మండలం బీర్నందికి చెందిన ఎనగందుల రవిని నియమించారు. ఈ సందర్భంగా రవిని పలువురు బీజేపీ నాయకులు మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

'వేతనం ఇవ్వలేదని అసత్య ప్రచారం చేయొద్దు'

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్ గ్రామపంచాయతీలో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు ప్రతినెలా వేతనం చెల్లిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి మల్లేశ్ పేర్కొన్నారు. మల్టీపర్పస్ వర్కర్లకు సమాన వేతనం ఇవ్వడం లేదని గ్రామానికే చెందిన ఓ వ్యక్తి అసత్య ప్రచారం చేస్తూ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఈవిషయమై మంగళవారం బుట్టాపూర్‌లో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మల్టీపర్పస్ వర్కర్లకు సమాన వేతనం ఇస్తున్నారని.. మరోసారి ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తే చర్యలు తీసుకోవడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వీడీసీ సభ్యులు తీర్మానం చేశారు. గ్రామపెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కుంటాల: మండలంలోని లింబా (కె) గ్రామంలో మంగళవారం రూ.ఏడు లక్షలతో చేపట్టే సీ సీ రోడ్ల నిర్మాణానికి నాయకులు భూమిపూజ చేశారు. ఎంపీటీసీ సునంద గిరీశ్‌కుమార్, మాజీ సర్పంచ్ ఆనందరావు పటేల్, వీడీసీ చైర్మన్ సిందె ఆనంద్, గణేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

దస్తురాబాద్: మండలంలోని మున్యాల గ్రామంలో మంగళవారం ఎల్లమ్మతల్లికి గౌడసంఘం ఆధ్వర్యంలో బోనాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని వీధుల గుండా శివారులోని ఎల్లమ్మతల్లి ఆలయం వద్దకు వెళ్లారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు బుర్ర రవి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో వాసవి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వాసవి పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో సత్తా చాటారు. ఈనెల 11న ఆన్‌లైన్‌లో నిర్వహించిన ధర్మ ఒలింపియాడ్ పరీక్షల్లో ఉమ్మడి రాష్ట్రం నుండి ఐదు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పాఠశాల విద్యార్థులు ఆరుషిరెడ్డి (9వ తరగతి), హన్సిక (ఎనిమిదో తరగతి), ప్రణయ్ (ఏడోతరగతి) ప్రతిభ చాటి నగదు పురస్కారం పొందినట్లు పాఠశాల డైరెక్టర్ జగదీశ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కరెస్పాండెంట్ పోతారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకస్మికంగా పాఠశాలలు తనిఖీ



పాతతర్లపాడ్‌లో పరిశీలిస్తున్న ఎంఈవో

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్, పాతతర్లపాడ్, ఎక్బాల్‌పూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో మధుసూదన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించి విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రవీందర్‌గౌడ్, రాజశంకర్, శాంతికుమార్ తదితరులు ఉన్నారు.

సంతోషిమాత ఆలయం ముస్తాబు

- నేడు 38వ వార్షికోత్సవం
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ సభ్యులు



ముస్తాబైన ఆలయం



ఆలయంలో అమ్మవారి విగ్రహం

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీ సంతోషిమాత ఆలయం వార్షికోత్సవానికి ముస్తాబైంది. పట్టణంలో భైంసా–నిర్మల్ రోడ్డు మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న ఆలయంలో బుధవారం 38వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. ఆలయం వద్ద భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర ఇదీ ..

భైంసాలోని సంతోషిమాత ఆలయం 1986లో నిర్మించారు. పట్టణంలోని భైంసా–నిర్మల్ రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ సమయంలో అమ్మవారి విగ్రహం బయల్పడింది. అప్పటి ఏడీఈ విదుమౌళి స్థానిక వ్యాపారి రాజారాం దృష్టికి తేగా, సబ్‌స్టేషన్ సమీపంలోనే ఆలయ నిర్మాణానికి సంకల్పించారు. దీంతో బయల్పడిన విగ్రహంతోపాటు గుజరాత్ నుంచి ప్రత్యేకంగా అమ్మవారి ప్రతిమ తెప్పించి ఆలయంలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటా వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు సైతం ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. దుర్గాదేవి నవరాత్రోత్సవాలు సైతం ఘనంగా నిర్వహిస్తారు.

ఏటా ఘనంగా ఉత్సవాలు..

ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు సుందర్, లంక గంగాధర్, పాపేశ్ పేర్కొన్నారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు.